ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- స్వామివారికి మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- పలు గ్రామాల్లో మాల ధారుల దీక్ష విరమణ

ఇబ్రహీంపట్నం/తిరువూరు/నూజివీడు: హనుమజ్జయంతి వేడుకలు మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో శనివారం వైభవంగా జరిగాయి. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్ర నాగావళి దళార్చన చేశారు. ఇబ్రహీంపట్నం, కొండపల్లి, మూలపాడు, కాచవరం తదితర గ్రామాల్లో మాలధారులు దీక్ష విరమణ చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వసతులు ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

తిరువూరులో..

తిరువూరు: హనుమజ్జయంతి ఉత్సవాలు తిరువూరు మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తిరువూరులోని స్వామి అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలోని పంచముఖ ఆంజనేయస్వామికి తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు, 40 అడుగుల విగ్రహానికి క్షీరాభిషేకాలు జరిపారు. పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయం, షిర్డీ సాయి మందిరం, చీరాల సెంటర్, రాజుపేట, కాకర్ల, లక్ష్మీపురం, కోకిలంపాడు, మునుకుళ్ల, రాజుపేట చెక్‌పోస్టు, వావిలాల, రాజుగూడెం, చౌటపల్లి, చిట్టేల, లక్ష్మీపురం, గానుగపాడు గ్రామాల్లో ఆంజనేయస్వామికి తమలపాకులతో, సిందూరంతో పూజాదికాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వాసవీ క్లబ్ నిర్వాహకులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. పలు ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

● **మేడూరు(గంపలగూడెం):** మండలంలోని పలు గ్రామాల్లో హనుమత్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గోసవీడు, తోటమూల, అనుముల్లంక, కొత్తపల్లి, సత్యాలపాడు, ఆర్లపాడు, ఊటుకూరు, పెనుగొలను, దుందిరాలపాడు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో స్వామి జయంతిని భక్తిశ్రద్ధలతో జరిపారు. పలు గ్రామాల్లో ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం చిన్న ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు ఆకు పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కూనపరాజుపర్వ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, హనుమాన్ చాలీసా పారాయణం, భక్తులకు అన్నదానం చేశారు. కుదపలో హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి.

మైలవరంలో..

మైలవరం: హనుమజ్జయంతి వేడుకలు మైలవరంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. మైలవరం రామకృష్ణ కాలనీ, నూజివీడు రోడ్డులోని రామాలయం, భద్రాచలం రోడ్డులో, తిరువూరు రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయాల్లో స్వామి వారికి పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

● **విస్సన్నపేట:** మండలంలో అన్ని రామాలయాలు, ఆంజనేయస్వామి దేవస్థానాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్, పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న రామాలయం, సత్తుపల్లి రోడ్డులోని రామాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. తాతకుంట్ల గ్రామంలో దాసాంజనేయ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. నెక్కళపు నాగేశ్వరరావు, జయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. వేమిరెడ్డిపల్లి గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు, అన్నసమారాధన నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

నూజివీడు: పట్టణంలోని రేఖా ఆస్పత్రి రోడ్డులో చిన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద వేకువ జాము నుంచే భక్తులు ఆంజనేయుడికి పూజలు నిర్వహించారు. 11వ వార్డు కౌన్సిలర్ గాదెరెడ్డి శ్రీలత నేతృత్వంలో అన్నదానం చేశారు. హనుమాన్ జంక్షన్ రోడ్డులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు జరిగాయి. గొడుగువారిగూడెం ఆంజనేయస్వామి ఆలయంలో, తుక్కులూరు అడవి ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

పట్టణంలోని మైలవరం రోడ్డులోని కోదండ రామాంజనేయస్వామి ఆలయం నుంచి హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. ఫైర్‌స్టేషన్ సమీపంలోని ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర బైక్ ర్యాలీ సబ్ కలెక్టర్ కార్యాలయం, శ్రీనివాస సెంటర్, పెద్ద గాంధీబొమ్మ సెంటర్, చిన్న గాంధీబొమ్మ సెంటర్, బస్టాండు సెంటర్, రాజీవ్ సర్కిల్, మున్సిపల్ ఆఫీసు సెంటర్, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్ల మీదుగా హనుమాన్ జంక్షన్ రోడ్డు నుంచి తుక్కులూరు అడవి ఆంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సదస్సు నిర్వహించారు.

● **ఆగిరిపల్లి:** ఆగిరిపల్లిలోని శోభనాచల ఆలయంలో యోగాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రామకృష్ణ భజన మందిరంలో విశేష పూజలు జరిపించారు. నెక్కలం గొల్లగూడెం, వట్టిగుడిపాడు సెంటర్ రామాలయంలో, వడ్లమానులో, ఈదులగూడెంలో, చొప్పరమెట్లలో ఆంజనేయ స్వామికి భక్తులు పూజలు నిర్వహించారు.

● **చాట్రాయి:** మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. చాట్రాయి, చిన్నంపేట, చనుబండ, సూరంపాలెం గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం, అన్నదానం నిర్వహించారు.

● **ముసునూరు:** ముసునూరు సిల్క్‌నగర్, చెక్కపల్లి, లోపూడి, గోగులంపాడు, గోపవరం, కాట్రేనిపాడు, వేల్పుచర్ల తదితర గ్రామాలలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.


మేడూరు ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు


తాతకుంట్లలో పూజలు చేస్తున్న భక్తులు


తిరువూరు రాజుపేటలో స్వామివారు


కాచవరం రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు


ఆగిరిపల్లిలోని శోభనాచల ఆలయంలో యోగాంజనేయ స్వామికి తమలపాకులతో అర్చన


ముసునూరులో స్వామివారు


తిరువూరులోని పంచముఖ ఆంజనేయస్వామి


మైలవరం రామాలయంలో ఆంజనేయస్వామి వారు


నూజివీడులోని చిన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నసమారాధనలో భక్తులు


నూజివీడు పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర


రెడ్డిగూడెంలో పూజలు

క్లుప్తంగా

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందాలి



తిరువూరు: విద్యార్థులు వేసవి సెలవుల్లో నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు కృషి చేయాలని తిరువూరు గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయాధికారి పద్మావతి అన్నారు. తిరువూరు గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ తరగతుల్లో నిరుపయోగంగా ఉన్న మంచినీటి సీసాలతో ఫ్లవర్ వాజ్‌లు, పెన్‌స్టాండ్ తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. చదువుతో పాటు తమకున్న ఆసక్తి మేరకు నైపుణ్యాలను పెంపొందించడంలో విద్యార్థులకు తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించాలని పద్మావతి సూచించారు. పుస్తక పఠనం, పద్యాలు చదవడం, యోగా, మెడిటేషన్లపై అవగాహన కల్పించారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



మైలవరం: బడి ఈడు పిల్లలను తప్పని సరిగా పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు పి. గోపాల్ అన్నారు. మైలవరం 6వ వార్డులో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు శనివారం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ఏరియాలో ఇంటింటికీ తిరిగి విద్యార్థులను బడికి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్య ఆవశ్యకత, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని తెలిపారు. ఉపాధ్యాయులు బి.మస్తాన్‌రావు, శ్రీలక్ష్మి, పీఎంసీ చైర్మన్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి దాతల విరాళం



తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలోని పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పలువురు దాతలు శనివారం విరాళాలు అందజేశారు. బత్తుల ఆంజనేయులు రూ.లక్షా 116, నాళ్ళా సత్యనారాయణరావు రూ.లక్షా 11 వేలు, కంచి చిన అంజయ్య రూ.15,116, మరింగంటి జగన్నాథాచార్యులు రూ.11,116, తుమ్మేపల్లి నాగవెంకటసాయి మనోహర్, గుండాల శేషగిరిరావు, రాచర్ల లక్ష్మి రూ.10,116 చొప్పున, తంగిరాల వెంకటరెడ్డి రూ.25,116, పరసా శ్రీనివాసరావు రూ.25,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు



మైలవరం: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయులు డి. రాంప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం విద్యార్థులకు బామ్మ చెప్పిన బంగారు నీతి కథలు పుస్తకాలు చదివించారు. విద్యార్థులచే కథలు చెప్పించారు. గ్రంథాలయాల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపు



చాట్రాయి: పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరుగుతుందని వ్యవసాయ అధికారి శివశంకర్ అన్నారు. శనివారం మండలంలోని చాట్రాయిలో పచ్చిరొట్ట ఎరువుతో కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడుతుండటంతో భూములు గుల్లబారి దిగుబడులు తగ్గుతున్నాయని చెప్పారు. అందువలన వ్యవసాయ భూముల్లో పచ్చిరొట్ట ఎరువులతో సేంద్రియ ఆమ్లాల వలన భాస్వరం, పొటాష్ లభిస్తుందని వివరించారు.

రైతుబజారు రోడ్డులో తరచూ ట్రాఫిక్ జామ్

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

నూజివీడు: పట్టణంలోని రైతుబజారు రోడ్డులో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు ఇరువైపులా ఆక్రమణలకు గురైంది. తోపుడుబండ్లు, కూరగాయల వ్యాపారులు సగం వరకు ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటం, దీనికి తోడు కూరగాయలను దించేందుకు వచ్చిన వ్యాన్లు, ఆటోలతో ఈ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొంటున్నాయి. పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు రైతుబజారు రోడ్డుపైకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ వైపునకు, కోనేరుపేట, పాతపేటలకు వెళ్లడానికి ఇది ముఖ్యమైన రహదారి. ఈ మార్గంలో పాదచారులు, ద్విచక్ర వాహనాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. కళాశాలలకు, పీజీ కేంద్రానికి, పాఠశాలలకు విద్యార్థులు కూడా ఈ మార్గంలోనే వెళ్లి వస్తుంటారు. ఈ మార్గంలోనే రైతుబజారు, ప్రైవేట్ కూరగాయల దుకాణాలు ఉండటంతో అసలు సమస్య ఎదురవుతోంది. కూరగాయల దుకాణాల వద్దకు కూరగాయలను దించేందుకు వచ్చే ఆటోలు, వ్యాన్లను రోడ్డుపైనే అడ్డదిడ్డంగా నిలుపుతుండటంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఒక్కసారి ట్రాఫిక్ స్తంభించిందంటే సజావుగా సాగడానికి కనీసం 20 నిమిషాలకు పైగానే పడుతోంది. అసలే ఇరుకు రోడ్డు కాగా, రోడ్డు మార్జిన్లలోనే తోపుడుబండ్లు, పండ్ల వ్యాపారులు, గంపల వ్యాపారులు కూర్చుని వ్యాపారాలు చేసుకుంటుండటంతో రహదారి మరింత ఇరుకుగా మారుతోంది. పోలీసులు పలుసార్లు తొలగించినా, అనేకసార్లు హెచ్చరించినా వారిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. కూరగాయల దిగుమతి ఎప్పుడు పడితే అప్పుడు చేయకుండా నిర్దిష్టమైన సమయాన్ని కేటాయించడంతోపాటు రోడ్డు పక్కన ఉన్న తోపుడుబండ్లను, పండ్ల వ్యాపారులను, గంపలలో అమ్ముకునే వారిని వేరే చోట ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటే ట్రాఫిక్ కష్టాలు తప్పుతాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.


రైతుబజారు రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

పోలీసు వాహనాలతో మార్చ్‌ఫాస్ట్

జగ్గయ్యపేట: ఈనెల నాలుగో తేదీన ఓట్లలెక్కింపు జరుగనున్న నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జగ్గయ్యపేట పోలీసులు శనివారం తమ పోలీసు వాహనాలతో పట్టణంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఇన్‌చార్జి సీఐ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు పట్టణంలోని ప్రధాన వీధులతోపాటు మండలంలోని తిరుమలగిరి, చిల్లకల్లు, గౌరవరం గ్రామాల్లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పరమేశ్వరరావు మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బైండోవర్ వ్యక్తులు ఘర్షణలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పాటించాల్సిన ఆయా అంశాలపై పోలీసులు, కేంద్ర బలగాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పద్మారావు, సూర్యభగవాన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


పోలీసులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి సీఐ పరమేశ్వరరావు

ఆలయాల్లో భక్తులకు అన్న సంతర్పణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక ప్రాంతంలోని పలు ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాత పోస్టాఫీస్ రోడ్డులోని కోదండ రామాలయం, ఫీడర్ రోడ్డులోని అండర్ పాస్ వద్ద రామాలయం, నల్ల గేటు డౌన్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయం, రాణిగారితోటలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నసంతర్పణ నిర్వహించారు. అభయాంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు ఆకు పూజ, అర్చనలు, హనుమాన్ చాలీసా నిర్వహించి స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. 3 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ధనుంజయ బాబు, బలరాం, గణేష్, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు. రాణిగారితోటలోని కోదండ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలుత ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.




అందుబాటులో వరి విత్తనాలు



విస్సన్నపేట: మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాలలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ రాజ్యలక్ష్మి శనివారం తెలిపారు. మండలంలోని నరసాపురం రైతు భరోసా కేంద్రం వద్ద వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఏఓ ప్రారంభించి మాట్లాడారు. ఖరీఫ్ సాగుకు విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద కొనుగోలు చేసుకోవాలని ఏఓ వివరించారు.

లైంగిక దాడి కేసులో డీఎస్పీ దర్యాప్తు



ముసునూరు: దళిత మహిళపై లైంగిక దాడి కేసులో ఘటనా స్థలాన్ని నూజివీడు డీఎస్పీ పరిశీలించారు. మండలంలోని సూరేపల్లికి చెందిన దళిత మహిళపై గురువారం ఉదయం గ్రామానికి చెందిన కొండపల్లి చెన్నారావు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ మహిళ శుక్రవారం సాయంత్రం ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు శనివారం విచారణ ప్రారంభించారు. నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య సిబ్బందితో కలిసి సూరేపల్లి నిమ్మతోటలోని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడిని అరెస్ట్ చేసి నూజివీడు కోర్టుకు తరలించగా 14 రోజుల రిమాండ్‌కు పంపారు.

● చిగురించిన చింత



గంపలగూడెం-మేడూరు రహదారి వెంట చింతచెట్లు చిగురుతో పచ్చగా కనిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో వచ్చే చింతచిగురును ప్రజలు పలు రకాల ఆహారాల్లో కలిపి ఎంతో ఇష్టంగా భుజిస్తారు. చింత చిగురు పప్పు, ఇగురు, పచ్చడితోపాటు కొందరు ఏడాదిపాటు ఉండేందుకు ఉప్పుతో కలిపి జాడీలలో నిల్వ ఉంచుకుంటారు. పుల్లగా ఉండే చింతచిగురు తినటం పలు విధాలుగా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇందులో ప్రధానంగా సి విటమిన్ ఉంటుంది. చింతచిగురును కోసి గ్రామాల్లో విక్రయిస్తూ కొందరు జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం కిలో రూ.300లకు పైగా ధర పలుకుతోంది. –గంపలగూడెం

కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ

నందిగామ: కౌంటింగ్ ప్రక్రియ అత్యంత సమర్థవంతంగా నిర్వహించేలా పటిష్ట ఏర్పాట్లు చేశామని నందిగామ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. రవీంద్రరావు తెలిపారు. నోవా ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం జరుగనున్న ఓట్ల లెక్కింపులో పాల్గొననున్న కౌంటింగ్ సిబ్బందికి శనివారం స్థానిక పట్టణంలోని కేవీఆర్ కళాశాల ఆవరణలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్వో రవీంద్రరావు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ రవీంద్రరావు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్‌ఐ

వత్సవాయి : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈనెల ఆరోతేదీ వరకు వత్సవాయి మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున పోలీసు నిబంధనలను అందరూ పాటించాలని ఎస్‌ఐ బి.అభిమన్యు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌంటింగ్ రోజున బైకుల ర్యాలీలు, బాణసంచా కాల్చడం, డీజేలు పెట్టడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

కంచికచర్లలో పోలీసు కవాతు

కంచికచర్ల : ఎగ్జిట్ పోల్స్ వస్తున్న సందర్భంగా ప్రజలు సంయమనం పాటించాలని, ఎటువంటి అల్లర్లకు పాల్పడరాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం సూచించారు. కంచికచర్లలో శనివారం పోలీస్ కవాతు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు కూడా సహకరించాలంటూ మైక్ ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత బాణ సంచా కాల్చటం, బైక్‌లతో ర్యాలీ చేయడం చేయరాదన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులు గుంపులుగా ఉండరాదని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ దుర్గారావు, హెడ్‌కానిస్టేబుల్ వేణు, స్థానిక, కేంద్ర బలగాల పోలీసులు పాల్గొన్నారు.